కథానిక

# స్వర్గానికి నిచ్చెనవేస్తాం

"జ్యేష్ఠ"

"గుడ్‌మార్నింగ్ మిస్టర్ జ్యేష్ఠ!" నా పాదాలకు సడెన్‌బ్రేక్ పడింది. ఆమెకెలా తెలిసింది నేను "జ్యేష్ఠ" నని? గాజుల గలగలలాంటి ఆమె నవ్వువిని తల పైకెత్తేను. ఆమె 'డిస్కవరీ' ఇచ్చిన షాక్‌నుంచి కొద్దిగా తేరుకుని "గుడ్‌మార్నింగ్" అన్నాను. ఆవిధంగా నాకామెతో పరిచయం కలిగింది.

నేను మిగిలిన పదిమెట్లనూ క్రిందికినెట్టి వరండాలో చేరుకున్నాను. నిన్ననే కాలేజీ తెరవడం వల్లా, ఇంకాఅరగంట టైముండడంచేతా అంతగా కలకలం లేదు కాలేజీలో, వరండా ఖాళీగాఉంది. "మీ కెలా తెలిసింది?" నేనడిగేను. "నిన్న తెలుగు పేపర్లు టేబిల్ మీదపడేశారు. ఫస్టుమార్కొచ్చిన పేపరుకదా అని మీది తీశాను. అందులో, ఎడిషనల్ షీటులో, ఇంగ్లీషులో... నేను నాలిక్కరుచుకుని నవ్వేశాను.

ఆమె అంటే వసుంధర ముఖం ఎలా ఉంటుంది అని ఎవర్నైనా అడగండి. వాళ్ళు "కోలగా ఉంటుందనిగాని, తెల్లగా ఉంటుందనిగాని, అందంగా ఉంటుందనిగాని" చెప్పరు, ఉత్సాహంగా, వెన్నెల వెలుగులు కురిపిస్తూ ఉందంటారు. (వాళ్ళకి కవిత్వానికీ ఎంతదూరమైనా సరే.) మేం ప్రాక్టికల్సు తగలేసినప్పుడల్లా గుండెలు బాదుకుంటూ వెళ్ళేవాళ్ళం. మా వెనుక డిమాన్‌స్ట్రేటర్ చేత మాకంటె ఎక్కువ చివాట్లుతిన్న విద్యార్థినీ బృందంవచ్చేది. నిత్యంపోజులు కొట్టే సుబ్బారావు దుఃఖభారంతో ఇంకా పోజులుకొట్టి కొద్దిలో శకటాదులను తప్పించుకోనేవాడు. అట్టిహృదయవిదారకస్థితిలో ప్రాక్టికల్సు ఎన్నివిధాలుగా పాడుచేయవచ్చునో, అందులో ఉత్తమోత్తమమైన పద్ధతి ఎన్నుకొన్న తానిపుడెలా పశ్చాత్తాపపడుతున్నదో వివరిస్తున్న సుశీలను వసుంధర అడుగుతుంది. "శీలా! జగన్నాథరథచక్రాలంటే?" మాలోనూ సందేహం జనిస్తుంది "జగన్నాథరథ చక్రాలంటే!" ఏవిటో తెలియకుండానే పొగిడేస్తున్నాం మేం, విద్యార్థులం. తీవ్రమైన చర్చ రేగుతుంది. మధ్యలో ఎవడేనా "ప్రాక్టికల్స్" గురించి మాట్లాడితే వాడి పళ్ళూడేటంత పనిజరుగుతుంది. జరిగిపోయిన ప్రాక్టికల్ గురించి ఏడిస్తే ఏంవస్తుంది. గడియారం వెనక్కి తిరుగుతుందా...?

ఆమె చుట్టుపక్కల విచారం, నిరుత్సాహం ఉండడానికి వీల్లేదు. "వారిదపంక్తిలో వెడలి వచ్చు మెఱుంగుల పిండునా సఖీవారంబుతో..." అన్నట్లు బిలబిలమంటూ వచ్చేవారు వసుంధర అండ్ పార్టీ కాలేజి ఫంక్షన్సులో ఏవేవో చిలిపి పనులు చేస్తూ తిరుగుతూ ఉండేది—ఓ గుంపుని వెంటేసుకొని ఏమిటో ఆమె ఆనందం! ఆమెను నవ్వమని చెప్పనక్కరలేదు. (ఆమె డాల్డావాడుతోందా?) మిగిలిన వాళ్ళలా ఉండరేం? ఈసురోమంటూ, భూభారం తామే మోస్తున్నట్లూ, ఫిలాసఫర్సులా పోజులిస్తూ...

మా స్నేహానికి కాలం నీళ్ళోసిపెంచింది. కాస్త వీలు దొరికితే చాలు కాలేజీ ఆవరణలో ఓమూల నున్న మామిడి చెట్టుకింద కూర్చునేవాళ్ళం. ఆమె ధోరణిచూస్తే దొరికే ప్రతిపుస్తకమూ చదివేసిందనుకోవాలి. ఒక మారు Good Earth గురించి చర్చిస్తున్నాం.

"వాంగ్‌లంగ్ షాపు యజమాని అడిగేడు "మొదటి బిడ్డా?"

వాంగ్‌లంగ్ అవునన్నాడు.

షాపు యజమాని తన వ్యాపారంలో ములిగిపోయాడు.

"ఇందులో నీకేంకనిపిస్తోంది?" వసుంధరఅడిగింది

నాకేం తెలియలేదు. "చిన్నవాక్యాలు" అన్నాను కొంటిగా ఆమె ఒక క్షణం ఆగి అంది. "చీనాలో పిల్లలపుట్టుకకి ఎంతతక్కువ ప్రాధాన్యం

ఉందో చూశారా? అనేమో." ఆమెకి 'అనేమో?' అనడానికి సందేహంలేదు. కాని నేనేమైనా చిన్న పుచ్చుకుంటానని తనకి పూర్తిగా తెలియదన్నట్లు. వసుంధర ఎంతలోతుకు పోయింది?

ఎంతో శ్రద్ధగా చదివి ఉంటుంది. సందేహం లేదు. ఏకాగ్రత కావాలంటే ఏకాంతం ఉండాలి. "చక్కని చప్పుడులేని చదువుకునేగది. అందులో ఆమె అల్లిన తెరలు. చక్కనిటేబిల్. పుస్తకాల బీరువా ఓ బుక్ కేస్ టేబిల్ లైటూ..." ఇలా ఊహించాను. వసుంధర రీడింగ్ రూమ్‌ని గూర్చి... ఆమె పుస్తకాలు నిత్యనూతనంగా ఉంటాయి!

కొన్నాళ్ళకి మా స్నేహం ఎంత వృద్ధిపొందిం దంటే నా కోసం ఎదురుచూసే మిత్రులు క్లాసులో వసుంధర నవ్వువినపడగానే "ఒచ్చాడ్రా బాబూ" అనుకొనేవారు. నన్ను రీడింగ్‌రూమ్‌లో చూసిన అమ్మాయిలు బయటినుంచే "వసుంధరా!" అంటూ వచ్చేవారు లోపలికి.

నేనంటే కాలేజీలో ఎంతో సదభిప్రాయం ఉంది. వసుంధర సోషల్‌గా ఉండడం మామూలే. పైగా ఆమె అంటే అందరికీ గౌరవం. అంచేత మా సాన్నిహిత్యం ఎవరినీ వింతపరచి ఆకర్షించ లేదు. మనవాళ్ళు ఎంత శుభ్రభస్తులేనా కానీయండి. దేవుడి (ప్రిఫరెన్సు వేంకటేశ్వరస్వామికి) ప్రసాదం అంటే కుంకుం, పసుపులతో గాఢమైత్రి నలవరుచు కున్నా, కొద్దిగా కుళ్ళినా, కళ్ళకద్దుకుని (ముక్కు నకు దూరంగా) తింటారు. తరువాత దోక్కోవడం మాటవేరు. మా ఇద్దరికీ మంచిపేరుంది కనుకవాళ్లు మాస్వైర విహారాలను సంహించారు. లేకపోతే (మా పరిచయం లేశమైనా కుళ్ళకపోయినా) ఎన్ని గోడలు కరాబు అయేవో...

"మన స్నేహం విషయం మీ పెద్దవాళ్ళకి తెలిస్తే ఏమవుతుంది?" నేను వసుంధరని అడిగేను. ఆమె పగలబడి నవ్వేసింది. "తెలిస్తే... తెలిస్తే... ఏం?" ఆమె మధ్య మధ్య నవ్వుతూ అంది. నేను కుదుటపడ్డాను. వసుంధర తల్లితండ్రులు కూడా నూతన భావాలతో ఉండిఉంటారు. "వసుంధర తల్లి నల్లద్దాలలోంచి ఇంగ్లీషు స్వతంత్ర చదువు తూనూ, తండ్రి చలంగారి నవలలో, 'కన్యా శుల్కం'మో చదువుతూనూ..." అలా ఊహించు కున్నాను.

వసుంధర ఒకరోజున చక్కగా బైండుచేసిన పుస్తకం తీసికొని వచ్చింది. అవి ఆమె రచనలు చాలావరకు పిల్లలకథలు, అందులో ఉన్న పిల్లలు మనకి కనపడితే ఎంత ఆనందంగా ఉంటుంది! ఒక కథలో నాలుగేళ్ళ పిల్లవాడుంటాడు. వాడు ఇంటికొచ్చిన హోమియో డాక్టరుతో అంటాడు "నాకు జబ్బుచేసింది."

డాక్టరు నవ్వుతూ అడుగుతున్నాడు. "ఏం మందియ్యను?"

ఆ కుర్రవాడు వెంటనే "తియ్య మాత్తర్లు" అంటాడు. అంటె ఆ కుర్రవాడు హోమియో మాత్రల రుచిమరిగి డైరెక్టుగా అక్కడ జబ్బు చేసిందంటాడు!

ఎచ్చటెచ్చటికో ఎగురుతూపోయే ఐదారేళ్ళ పాపలే అందరూ. వసుంధర పిల్లల్ని ఇంత ప్రేమతో ఇంత ఆనందంగా, ఆహ్లాదకరంగా చిత్రిస్తోంది. ఆమె తమ్ముడొకడున్నాడుట ఐదారేళ్ళవాడు. ఆ పాపని చూసే ఈ కథలు వ్రాసివుంటుంది. లేక పోతే పుట్టుకతోటే సామ్యవాద సిద్ధాంతాలు జీర్ణించుకొని 'నాన్నకు రెండు పళ్ళిచ్చి నాకొకటే ఎందుకిచ్చావు' అనే పాపల (వాళ్ళదే ప్రస్తుతం మెజారిటీ) ను ఎందుకు చిత్రించలేదు? ఆమె తమ్ముడు యూంకివారిసూ బాలహీరోలా పాల బుగ్గలతో, మంచి బట్టలతో ముద్దు మాటలతో... ఉండి వుండాలి. బాల సాహిత్యం ఇంత అందంగా ఉంటుందని తెలిస్తే అదే వ్రాసేవాడినికదా అని విచారించేను.

"కాలేజీ అవర్సులో ఇంత కులాసాగా ఉండే వసుంధర ఏనాడూ పార్కుకి రాదేం? లాంగ్ బెల్ కొట్టాక ఒక్క నిముషం ఆగదేం? నాతో కాలే జీలో ఇంత సన్నిహితంగా వుంటుంది ఒకమారూ ఇంటికి ఆహ్వానించదేం?" వీటికి సమాధానం దొరక లేదు.

ఒకమారు వసుంధర నా రికార్డు తీసుకు వెళ్ళింది. దాన్ని తెచ్చుకొనే మిషతో ఇంటికి వెళ్ళాను. మెట్లెక్కుతుంటే ఒంటినిండా బురదతో చిద్విలాసంగా కనపడుతున్న ఐదారేళ్ళ చిన్న వాని దర్శన దౌర్భాగ్యం కలిగింది "ఎందుకులా? దొంగ ఎదవా?" అని మీదపడి కరవబోయాడు. పంక జనిత దుర్గంధం నాఘ్రాణేంద్రియాన్ని ముట్ట

డించగా రుమాలడ్డు పెట్టుకుని ఇంటివాకిట్లోకి గెంతాను. వాడు తరుముకొచ్చాడు. "ఎవడు వీడు?" అనుకొంటూ వుండగా వసుంధరవచ్చి "తమ్ముా! స్నానానికిరా" అని రెక్కపట్టుకొని లాక్కువెళ్ళింది. నన్ను చూడలేదు. నేను తెల్లబోయాను. ఈమర్కట కిశోరం ఆమె తమ్ముడా! సకల జంతులక్షణ సమన్వితుడు! వీడరిస్తే గార్ధభం; కరిస్తే కుక్కురం రడ్‌యార్డ్‌క్లిప్లింగ్ వీడినిచూస్తే ఎంతానందించేవాడో! వీడే నా తమ్ముడైతే (మేగాడ్ ఫర్‌బిడ్!) పిల్లలంటే పాము పగలాంటి పగపుట్టించే కథలు వ్రాసేవాణ్ణే!

ఒక ఏభైఏళ్ళ మనిషి, వసుంధర తండ్రేమో, కుర్చీలో కూర్చున్నాడు. ఎంగిలాకులు తినే ఆకలిగొన్న కుక్క, మరో కుక్క అక్కడికివస్తే దాన్ని ఎంత సదభిప్రాయంతో ఎదుర్కొంటుందో ఆయన అంత సతభిప్రాయంతో నన్ను చూశారు. చుట్టపొగ వివిధ భంగిమల్లో వదులుతూ "ఎందుకు?" అన్నట్లు చూశాడు. "నా పుస్తకం ఉంది." ఆయన కోపంగా అడిగాడు. "ఇక్కడెందుకుంది?" మేష్టారి దగ్గర తీసుకోవడంలో పొరపాటైంది. ఆయన కొద్ది శాంతించాడు. "బ్రాహ్మలేనా?" "ఊఁ" "ఒడుగైందా?" "లేదు" వెంటనే ఆయన కుర్చీ నాకు దూరంగా జరుపుకున్నాడు "దుష్టులకి..." అన్నట్లు-వసుంధరనికాలేజీకి ఎలా వెళ్ళనిస్తున్నాడు?

ఎవరో ఒకావిడ, వసుంధర తల్లేమో, బయిటికి వచ్చి కనుబొమలు ముడివేసి చూస్తోంది "ఎవడీ అంట్ల వెధవ" అన్నట్లు. ఆ చూపులో నేను ఉక్కిరిబిక్కిరైపోయాను. ఆమె లోనికి పోయింది.

నేను వాళ్ళేమనుకున్నా కదల దల్చుకోలేదు. ఇంతలో ఐదుగంటల కూత వినపడింది. ఆ వృద్ధ దంపతులు సుపుత్రసహితంగా నిష్క్రమించారు. "పదండి ముందుకు" అన్నట్లు మహా సంరంభంతో గుడిలో జరిగే పూజలకి కాబోలు: వాళ్లు వెళ్ళడం కసిగా చూస్తూంది వసుంధర అంట చేతుల్తో. వాళ్లు వెళ్ళగానే ధబాలున తలుపు వేసి వెనక్కు చూసింది నేను! చూసి మొగం తిప్పుకొని పెరట్లోకి పారిపోయింది. ఆ స్థితిలో కనపడ్డాడని సిగ్గుపడింది.

నీళ్ళు కారుతున్న ముఖంతో తిరిగి నవ్వుతూ వచ్చింది. క్లాస్‌మేట్ వసుంధర. తిరిగి అదేకొంటె మొగం ఏదో వెతుకున్నట్టు తిరిగే లేడికళ్లు తన బాధం తాదాచేసుకొని...గుండెల్లో మంటల్లోంచి వెన్నెల కురిపిస్తోంది. వెన్నెలకూడా సూర్యుని వెలుగేకదూ!

"వాళ్ళింకా రెండు గంటలదాకా రారులే! చూశావుకదూ!" ముఖం తుడుచుకుంటూ అడిగింది ఇంట్లోకి వెళ్ళి గాజు గ్లాసుతో పాలు తీసుక వచ్చింది. "ఇవి తీసుకో మా యింట్లో కాఫీతాగం" ప్రాధేయ పడుతూన్నట్టున్నాయి ఆమాటలు. నేను నవ్వుతూ "నీ చేతిలో మంచినీళ్లిచ్చినా చాలు. అందెంత అదృష్టం!" అన్నాను ఆమె తిరిగి నవ్వులు కురిపించడం మొదలు పెట్టింది: పెదిమలు కొంటెగా తిప్పి "ధన్యురాలను" అంది.

గోడలకి బొమ్మలుగాడిన గదిలోకి తీసుక వెళ్ళింది. అందులో టేబిల్‌కాని, బీరువాగాని లేవు. "ఇది నా రీడింగ్‌రూం. బెడ్‌రూం. మా తమ్ముడు వాడిని చూశావా?" వాణ్ణి తలుచుకొంటేనే ఒళ్ళుమండేది. "ఆహా" అన్నాను "వాడునాగదిలోనేపడక."

"ఆఁ" నేనన్నాడు.

"వీడేకాదు. ఇంటికొచ్చిన ఆడ చుట్టాలూ ఇక్కడే. పక్కగదిలోనే నాన్నగారు." వసుంధర చెప్పుకుపోతోంది. "నాన్నగారి గుర్రువింటే దొంగలుకూడ గుమ్మంవద్దనుంచే పారిపోతారు."

"ఇంతకన్నా ఎలక్షన్ వూరేగింపు పక్కనెట్టుకొని సుఖంగా చదవొచ్చు. అంత తదేకధ్యానంతో ఎలాచదువుతావు?" "అదేం కష్టంలేదు" వసుంధర గర్వంగా అంది.

నా గొంతుక ఎండి పోతోంది. "మీ నాన్న గారు..."

"ఆయనకి నా చదువు కిట్టదు. మా మావయ్య చెప్పిస్తున్నాడు వీళ్ళతో హోరాహోరి .పోరాడి. ఆయనకి మతిస్థిరంకూడా సరిగాలేదు."

"ఇటువంటి మనుషుల మధ్య జీవిస్తూ, కాలేజీలో నువ్వాలా ఉండడం నీ కెంతోగర్వకారణం" నేనన్నాను. "నాన్నగారు పూర్వంకంటె చాలా మెరుగు" నా గుండె జల్లుమంది. ఇప్పుడే ఇంత మృదువుగా ఉన్నారు!

"పూర్వం పిలకా, జందెం ఇత్యాది ఆభరణాలు లేనివాడు కొంపలో అడుగెడ్తే వాడి పిలకూడదీసి తరుముకెళ్ళేవారు. కాలేజీలో చదివేవాళ్ళ పోకిరీలనీ..."

"అవును. ఆ భావం మీ తమ్ముడికి సంక్రమించింది."

వసుంధర తల ఆడించి అంది. "వాడిప్పటికీ మా నాన్నని కరుస్తాడు. మా అమ్మని రక్కుతాడు; తన్నుతాడు. కాని నా దగ్గర కిక్కురుమనడు. ఇంకా మారిపోతాడు. ఆటవికదశలోంచి..."

"ఇదంతా నీ సంస్కరణే?" నేనడిగాను!

"ఆహాఁ!"

"మానవుణ్ణి పరిస్థితులకి బానిస అంటారు. నీవు నీ పరిస్థితులకి సరిగా వ్యతిరేకంగా. నువ్వు దేవతవా?" నే నడిగాను.

"దేవతలకి కష్టాలురావు. వచ్చినా వాళ్ళు మనుష్యుల్లా వాటిని ఎదుర్కోలేరు. పరిస్థితులను ఎదుర్కోడంలోనే ఘనతఉంది. గోర్కీలో ఏం చూశావు? Man becomes man through his resistence to his environment సెలవు లిస్తారు. నన్ను మరచిపోతావా?" "జీవితంలో మరిచిపోలేను. వెళ్లొస్తాను."

---

# తథాగతము

మసూనా

పాల కడలిలోన లక్ష్మి
ప్రభవించెను నాడు
మనుజుల చెమటల పంటగ
జనియించెను నేడు

సర్వేశుని అర్ధాంగిగ
సంచరించెనపుడు
ధనస్వామి బీగానికి
దాసోహమ్మిపుడు

ఆర్తజనావనుండయ్యె
లక్ష్మీశుడు నాడు
స్వార్థపరాయణుండయ్యె
సంపన్నుడు నేడు

లక్ష్మీపతి ప్రార్థన, జన
లక్షణ మా ప్రొద్దు
సంపన్నుని చరణమ్ముల
సాకుట యీ ప్రొద్దు

వాసుదేవు ప్రాపు, జనత
వర్ధిల్లగనయ్యె
ధనరాజుల సేవ జనో
ద్ధరణ చేయదయ్యె

కోట్లకు పడగెత్తినను
కొదువను మదినుంచీ
సిరిపై తమ పెత్తనమ్ము
చేయదలతురొకరు

లంకణాల, సత్యాగ్రహ
లక్ష్యము మదినెంచి
లక్ష్మి ప్రసాదమ్మును
లక్షింపెదరొకరు

ఇరుతెగలకు సామరస్య
మెటుల కుదరగలదు
వర్తమాన జనసంతతి
ప్రగతి పొందునెటులు?

శాసనమే సవరింపగ
సావకాశమైన
స్వాభావికమును మార్చగ
సానుకూలమవదా?

గాంధీ జీవితము, బౌద్ధ
గాథల సన్నిహితం
మానవులకు గరపునట్టి
మహిత తత్త్వమేది?

కర్కోటకముల్ క్రమమున
కడముట్టుట నిజము
సాధుజీవతతుల పెంపు
సమకూడుట ధృవము

సృష్టి చరిత్ర విశదము
చేయునదీ విధము
హితాహితమ్ముల సార
మ్మెరుగు తథాగతము